ఏళ్లుగా ఖాళీలే..!

పురపాలికల్లో భర్తీకి నోచుకోని పారిశుద్ధ్య కార్మికులు

- లోపిస్తున్న స్వచ్ఛత
- 13 మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ కింద కేవలం 1746 మందే
- జనాభా ప్రతిపాదికన కార్మికులను భర్తీ చేయాలంటున్న పుర ప్రజలు



సాక్షి,సిటీబ్యూరో: మున్సిపాలిటీల్లో ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుల భర్తీ లేకపోవడంతో స్వచ్ఛత లోపిస్తున్నది. డ్రైనేజీలు, రహదారులు, వీధులు శుభ్రం చేసే స్వీపర్లు, ఇతర కార్మికుల సరిపడా లేక పట్టణాల్లో పారిశుద్ధ్యం పడకేస్తున్నది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలికల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది. ఏళ్లుగా పట్టణాల్లో పారిశుద్ధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదంటే పరిస్థితి ఎలా ఉందో విదితమవుతోంది.

నిబంధనలకు తూట్లు..

- రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 28 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు పని చేయాల్సి ఉంటోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, నాగారం ,తూంకుంట, గుండ్లపోంచపల్లి, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,239 జనాభా ఉంది. ప్రస్తుతం ఆయా పురపాలక సంఘాల్లో సుమారు 10 లక్షలకు పైగా జనాభా ఉంటుందని అంచనా. ఇటీవలే 7 మున్సిపాలిటీల పరిధిలోకి 28 గ్రామ పంచాయతీలు విలీనమైన విషయం తెలిసిందే. ఈ పురపాలక సంఘాల్లో 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిపైనే భారం పడుతోంది. దీంతో పలు పురపాలికల్లో చెత్త సమస్య తీరని వ్యథగా దర్శమిస్తోంది. సంబంధిత అధికారులు కూడా ఉన్న సిబ్బందితోనే పనులు చేయించాల్సి వస్తోంది.
- గ్రేటర్ హైదరాబాద్ శివారులోని 13 పురపాలికల్లో ప్రస్తుత జనాభా 10 లక్షల దాటవచ్చు నంటున్నారు. ఈ లెక్క ప్రకారం ఆయా పురపాలకల్లో 2,840 మంది పారిశుధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటోంది.
- 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు లేకపోవడంతోఅవుట్ సోర్సింగ్ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుధ్య వ్యవస్థను కొనసాగిస్తున్నారు.

ప్యానల్ పోస్టులకే ప్రాధాన్యం..

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్ఐలు, క్లర్కులు, బిల్ కలెక్టర్లు వంటిప్యానల్ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్ పోస్టులు భర్తీ అయ్యాయి. అయితే అవసరమున్న పారిశుధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉండిపోయాయి.

పురపాలక సంఘాల వారీగా ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలకల్లో అవుట్ సోర్సింగ్ కింద 1746 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో మున్సిపాలిటీల వారీగా పారిశుధ్య కార్మికుల సంఖ్య ఇలా ఉంది. ఫీర్జాదిగూడలో 56 పారిశుధ్య కార్మికులు, నిజాంపేటలో 248, నాగారంలో 145, మేడ్చల్‌లో 139, కొంపెల్లిలో 188, జవహార్‌నగర్‌లో 90 మంది పని చేస్తున్నారు. బోడుప్పల్‌లో 182, దుండిగల్‌లో 150, ఘట్‌కేసర్‌లో 86, గుండ్లపోచంపల్లిలో 120, దమ్మాయిగూడలో 157, పోచారంలో 111, తూంకుంటలో 74 మంది అవుట్ సోర్సింగ్ కింద సేవలందిస్తున్నారు. అయితే ఇటీవల 7 మున్సిపాలిటీల పరిధిలో విలీనమైన 28 గ్రామ పంచాయతీల కార్మికుల సేవలను పారిశుధ్య పనులకు ఉయోగించుకుంటున్న పుర అధికారులు వారిని అధికారిగా మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 3న (నేడు) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చెరువును సందర్శించిన పర్యావరణవేత్తలు



స్థానికులతో మాట్లాడుతున్న పర్యావరణవేత్తలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ వినయకసాగర్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువును పలువురు పర్యావరణవేత్తలు శనివారం సందర్శించారు. ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఎదులాబాద్‌లో మూసీ కాలువను పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మూసీ కాలువపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పర్యావరణవేత్తలు సత్యనారాయణ, నవీన్‌కుమార్, పద్మ, అనన్య, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ పద్మారావు, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ దర్మారెడ్డి, శ్రీశైలం, జీవన్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు కీసరలో సామూహిక కార్తీక దీపోత్సవం

కీసర: కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ శివాలయాల్లో ప్రతి సోమవారం సామూహిక దీపోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కీసరగుట్టలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 4న మొదటి సోమవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సామూహిక దీపోత్సవంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొననున్నారు. దాదాపు 200 మంది మహిళలకు పసుపు, బొట్టు, కుంకుమ, జాకెట్టు, గాజులు, ప్రసాదం ఉన్న కిట్లను మంత్రి అందజేయనున్నారు. అనంతరం మెదక్ జిల్లాలోని రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీ స్వామి అనుగ్రహ ప్రవచనం, కార్తీక వైభవం గురించి శివానందలహరి గీతాలాపన కార్యక్రమాలు ఉంటాయి. ఆది, సోమవారాల్లో శ్రీవినాయక నాట్య మండలి సురభి వారిచే భూకైలాస్, మాయాబజార్ నాటకాల ప్రదర్శన ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అఖిల్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డబిల్పురం అఖిల్ (28) మేడ్చల్‌లో ఉన్న ప్రొఫెషనల్ కొరియర్‌లో పనిచేస్తున్నాడు. రోజులాగే గత శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా అత్వెల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

చెట్ల కొమ్మలు మీద పడి వ్యక్తి..



రామయ్య మృతదేహం

జవహర్‌నగర్: చెట్ల కొమ్మలు మీద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీలో నివసించే కొప్పిశెట్టి పట్టాభి రామయ్య (36) బిట్స్ పిలానీ క్యాంపస్‌లో ఆక్యుపేషన్ గార్డెన్‌గా పనిచేస్తూ, భార్య ఝాన్సీ, పిల్లలతో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం రామయ్య విధులకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో భార్య రామయ్యకి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో బిట్స్ పిలానీ డీ బ్లాక్ వద్దకు వెళ్లి చూడగా చెట్ల కొమ్మలు మీద పడి తలకు గాయాలతో కనిపించాడు. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు భార్య ఝాన్సీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పోచారం: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన ప్రకారం..పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వెంకటాపూర్ చెరువు వద్ద సుమారు 35–40 వయస్సు ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. వెంకటాపూర్, జోడిమెట్ల ప్రాంతాల్లో భిక్షమెత్తుకుని చెరువు సమీపంలో పడుకునేవాడని తెలిసింది. ఆకలితో అలమటించి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం..



మారుతీరావు మృతదేహం

కీసర: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కి చెందిన మారుతీ రావు (24) కీసర వన్నిగూడ సమీపంలోని క్రషర్ గుంతలో పడి శుక్రవారం గల్లంతు కాగా పోలీసులు శనివారం మృతదేహాన్ని వెలికితీశారు. డీఆర్ఎఫ్ అగ్నిమాపక శాఖతో పాటు పోలీసులు గజ ఈతగాళ్లతో రెండు రోజుల పాటు గుంతలో గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు శనివారం సాయంత్రం మృతదేహాన్ని వెలికితీశారు. మొదటిరోజు డీఆర్ఎఫ్ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో తీవ్రంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రెండోరోజు కీసర సీఐ వెంకటయ్య సిద్దిపేట నుండి ప్రత్యేకంగా గజ ఈతగాళ్లను రప్పించి క్రషర్ గుంతలో రాళ్ల మధ్య ఇరుక్కుపోయిన యువకుడి మృతదేహాన్ని అతికష్టం మీద వెలికితీయించారు. ప్రేమలో విఫలమైనందుకు తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అతని స్నేహితుల సెల్‌ఫోన్లకు మెసెజ్ చెసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల డైట్ చార్జీల పెంపుపై హర్షం



కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యార్థులు

మేడిపల్లి: మేడిపల్లిలోని మహాత్మ జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర బీసీ పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు డైట్‌చార్జీలు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వం, కృషిచేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలో కేక్ కట్‌చేసి హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు మంచి భోజనవసతి, సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. నిరుపేద, ప్రతిభ గల విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తే వారు భవిష్యత్తులో చదువుల్లో ఉన్నతంగా రాణించి లక్ష్యాలను చేరుతారన్నారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేశారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీవల్లి శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కూచిపూడి నృత్యంలో శ్రీ విఘ్నరాజం భజే, మూషికవాహన, మహేశ్వరి మహాకాళి, కృష్ణ శబ్దం, రాజశ్రీ తిల్లాన, శివాష్టకం తదితర అంశాలను ప్రదర్శించారు. భరత నాట్య ప్రదర్శనలో పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, రామదాసు కీర్తన, రామభజన, మూషిక వాహన అంశాలను లౌక్య తనుశ్రీ, అధ్యవృందా, రితిక, రుహిక, కీర్తి, శ్రీకృతి, మోక్ష తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన ఐదుమంది సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా వారి వైద్య ఖర్చుల నిమిత్తం పద్మకు రూ.15,500, శ్రీనివాస్‌కు రూ.60 వేలు, హిమబిందుకు రూ. రూ.42 వేలు, రత్న మాణిక్యంకు రూ.32,500, మాధవన్‌కు రూ.60 వేల చెక్కులను శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్, డివిజన్ కార్యదర్శి బాలకృష్ణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని న్యూ అంబేడ్కర్‌నగర్‌లో శనివారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పర్యటించారు. పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. తొందర్లోనే రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు. కాలనీలో నూతనంగా డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లతో పాటు సీసీరోడ్లు వేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్ట బుచ్చన్నగౌడ్, విఠల్‌యాదవ్, రవి, అశోక్, షరుఫ్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత



మల్లాపూర్: దీపావళి పండుగను పురస్కరించుకుని నాచారం అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు క్యాప్‌బౌల్ (చిన్నపిల్లల) అనాథాశ్రమం, శ్రీ అక్షర వృద్ధాశ్రమానికి బియ్యం, పప్పులు, నూనె తదితర వంటసామగ్రిని అందజేశారు. పాఠశాల డైరెక్టర్ చిలక శివకుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకుని వృద్ధులు, అనాథలకు తమవంతు సాయం అందించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కల్పన ప్రధానోపాధ్యాయురాలు నిషాత్ అంజూమ్, హబ్సిగూడ ఇన్‌చార్జి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మేడ్చల్: వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈనెల 3న (నేడు) మేడ్చల్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ఏడీఈ రాజమల్లేశం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చెక్‌పోస్ట్‌లోని విద్యుత్ కార్యాలయంలో సదస్సు జరుగుతుందని ఏమైనా సమస్యలు ఉన్న వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలన



కీసర: రాంపల్లిదాయరలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎంపీడీవో గ్యామానాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు.

చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో సీసీఎస్ ప్రతినిధులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సీసీఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, సారా అనిల్‌ముదిరాజ్, గంప కృష్ణ ఎమ్మెల్యేను కలిసి డివిజన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ పరిధిలోని శివసాయినగర్, వాసవి శివనగర్ కాలనీల్లో బాక్స్ డ్రైనేజీ నిర్మాణం, చర్లపల్లి శ్మశానవాటిక అభివృద్ధి, విస్టా హోమ్స్‌లో లక్షల్లో వచ్చిన తాగునీటి బిల్లుల అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దశలవారీగా డివిజన్‌లో వసతులు కల్పించి డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

సభ్యత్వ నమోదులో మల్కాజిగిరి ముందంజ



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కుషాయిగూడ: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మల్కాజిగిరి పార్లమెంట్ మొదటి స్థానంలో ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మల్లాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్‌జిల్లా సభ్యత్వాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పది లక్షల ఓట్లు వస్తే ఐదు లక్షల సభ్యత్వాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో ఇప్పటికే మూడు లక్షల సభ్యత్వాలు పూర్తిచేసి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఈనెల 10వ తేదీలోపు మిగతా సభ్యత్వాలను పూర్తిచేసేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ మేరకు మూడు జిల్లాల పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. గత ఐదు నెలలుగా హైడ్రాతో ఇబ్బందులు పడుతున్న మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు అండగా నిలిచామన్నారు. స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ముందుకెళ్లాలన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటెపల్లి జనార్దన్‌రెడ్డి, బీజేపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి స్థానికనేతలు పాల్గొన్నారు.

విద్యార్థినికి సర్టిఫికెట్ల అందజేత



అంజలికి సర్టిఫికెట్లు అందజేస్తున్న హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్

కుషాయిగూడ: చదువు పూర్తయిన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న కళాశాల యజమాన్యంపై ప్రముఖ న్యాయవాది సుంకర నరేష్ న్యాయస్థానంలో పోరాడి విద్యార్థినికి సర్టిఫికెట్లు అందజేశారు. రాంపల్లికి చెందిన తన్నీరు అంజలి 2022–24లో తార్నాకలోని ఓ కళాశాలలో ఇంటర్ మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ కోర్సు పూర్తి చేసింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల యజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసింది. దీంతో సదరు విద్యార్థిని హైకోర్టు న్యాయవాదిని సంప్రదించగా ఆయన పిల్ వేసి సర్టిఫికెట్లు వచ్చేలా చొరవ తీసుకున్నారు. కోర్టు ద్వారా అందుకున్న సర్టిఫికెట్లు విద్యార్థినికి అందజేశారు. తనను సంప్రదిస్తే ఉచిత న్యాయసాయం అందజేసి తోడ్పాటునందిస్తానని న్యాయవాది పేర్కొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మల్లాపూర్: గంజాయి, మద్యానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి వాటి నివారణకు కృషి చేయాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ అన్నారు. శనివారం తెలంగాణ నార్కొటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్లు రాంప్రసాద్, ప్రవీణ్ ఆధ్వర్యంలో నాచారం పారిశ్రామికవాడలోని ఎల్మోటి అల్టర్నేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులకు రోడ్డుభద్రత, సైబర్ సెక్యూరిటీ సమస్యలు, యాంటీ నార్కోటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యానికి హానిచేసే గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే మేసేజీలు, లింక్‌లు అనవసరంగా ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల కారణంగా మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

కీసరగుట్టలో కార్తీక పూజలు షురూ

- ఉదయాన్నే పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- స్వామివారిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్
- అభిషేక పూజల్లో ఆలయ చైర్మన్, ఈవో



స్వామివారి సన్నిధిలో ఎంపీ ఈటల రాజేందర్

కీసర: ప్రఖ్యాత శైవ క్షేత్రం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం కార్తీకమాసోత్సవ ప్రత్యేకపూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీ స్వామివారికి (శివలింగానికి) అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అనంతరం క్షీరాభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపోత్సవ కార్యక్రమంతో కార్తీకమాస పూజలకు అంకుర్పారణ చేసినట్లు పండితులు తెలిపారు. స్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూజల్లో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వామివారి సేవలో ఎంపీ ఈటల..

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఉదయమే ఆలయానికి వచ్చిన ఆయనకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఎంపీకి ఆశీర్వచనంతో పాటు, మహా ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తానన్నారు. అదేవిధంగా దేవస్థానం దాతల సహకారంతో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను ఆలయ చైర్మన్ నాగలింగం, ఈఓ సుధాకర్ రెడ్డి ఎంపీకి వివరించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దర్శనానికి క్యూలో భక్తులు..



గర్భాలయంలో అభిషేక పూజలు



ఆకాశ దిపోత్సవం పూజలు..